ఉత్తరం కాకతీయ
TG TEL/25/A1234
www.kakatiyanews.com
శనివారం, 03 అక్టోబర్ 2026 | సంపుటి: 02 సంచిక: 45 | పేజీలు: 4 వెల: 5

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

- ఇళ్ల స్థలాలు.. వైద్య సదుపాయాలు పునరుద్ధరించాలి
- మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి
- జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక చట్టం తేవాలి
- టీయూడబ్ల్యూజే జిల్లా శాఖ డిమాండ్



**కాకతీయ, హనుమకొండ :** జర్నలిస్టుల హక్కులు, భద్రత, సంక్షేమానికి సంబంధించిన దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఐజేయూ అనుబంధ తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(టీయూడబ్ల్యూజే) హనుమకొండ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. గాంధీ జయంతిని

........(తరువాయి 2లో)

# వరంగల్ అస్తిత్వం దెబ్బతింది

తెలంగాణ ఉద్యమాల్లో గర్జించిన చారిత్రక ఓరుగల్లు గడ్డ స్వరాష్ట్రంలో అన్ని రంగాల్లోనూ దారుణంగా వెనుకబడిపోయిందని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్, ప్రముఖ న్యాయవాది గుడిమళ్ల రవికుమార్ అన్నారు. ఒకప్పుడు వరంగల్ అంటేనే తెలంగాణలో ప్రత్యేకమైన బ్రాండ్ ఉండేదని, రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆ ప్రాధాన్యం క్రమంగా తగ్గుతూ ప్రస్తుతం మసకబారుతోందని పేర్కొన్నారు. హైదరాబాద్ తర్వాత రెండో రాజధానిగా అభివృద్ధి చేస్తామన్న ఆశలు నెరవేరలేదని, కొందరి స్వార్థపూరిత రియల్ ఎస్టేట్, ఆర్థిక ప్రయోజనాల కోసం జిల్లాను విచక్షణారహితంగా ముక్కలు చేశారని విమర్శించారు. జిల్లాను విభజించడం వల్ల వరంగల్ సమగ్ర రాజకీయ, సామాజిక అస్తిత్వం బలహీనపడిందని, ప్రజల తరఫున ప్రశ్నించాల్సిన ప్రజాప్రతినిధులు అధిష్ఠానం వద్ద మోకరిల్లడంలో, కాళ్లు మొక్కడంలో పోటీ పడుతున్నారని వ్యాఖ్యానించారు. తన రాజకీయ ప్రయాణంలో ఎదురైన పరిణామాలు, ఎంపీ టికెట్ చేజారిన తీరు, కేసీఆర్‌తో తన అనుబంధం, తెలంగాణ ఉద్యమకారుల పరిస్థితి, ఓదార్పు యాత్ర, ఆటోడ్రైవర్ల సమస్యలు, భవిష్యత్ రాజకీయ ప్రస్థానంపై తెలంగాణ డిజిటల్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..



## జిల్లాను ముక్కలు చేసి ఆగం చేశారు

- ప్రశ్నించే తత్వాన్ని లేకుండా చేసే కుట్ర జరిగింది
- ఎంపీ టికెట్ చేజారడం వెనుక నలుగురు నేతలు
- నా రాజకీయ గురువు ఇప్పటికీ.. ఎప్పటికీ కేసీఆరే
- ఉద్యమకారుల బతుకులు మారలేదు
- రూ.10 వేల కోట్లతో ఉద్యమకారుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్, ప్రముఖ న్యాయవాది గుడిమళ్ల రవికుమార్
తెలంగాణ డిజిటల్ మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్

4

# చినుకు కోసం.. చేను చూపు

## ఉమ్మడి వరంగల్‌పై వర్షాభావ పిడుగు

| | |
|---|---|
| ఎల్‌నినో ప్రభావంతో కరువు ఛాయలు | 3 లక్షల ఎకరాలకు పైగా వరి సాగుకు బ్రేక్ |
| అడపాదడపా వర్షాలతో నిండని చెరువులు | అడుగంటుతున్న భూగర్భ జలాలు..మోగుతున్న ప్రమాద ఘంటికలు |



**కాకతీయ, హన్మకొండ ప్రతినిధి :** ఉమ్మడి వరంగల్ జిల్లా రైతాంగంపై వర్షాభావం తీవ్ర ప్రభావం చూపుతోంది. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో పంటల సాగు నుంచి దిగుబడుల వరకు ప్రతికూల పరిస్థితులు నెలకొన్నాయి. ఆరు జిల్లాల పరిధిలో సగటున 28.16 శాతం వర్షపాతం లోటు నమోదైంది. దీంతో చెరువులు పూర్తిస్థాయిలో నిండకపోగా.. భూగర్భ జలాలు కూడా పుంజుకోలేదు. ఫలితంగా సాధారణంగా సాగు కావాల్సిన 15 లక్షల ఎకరాలతో పోలిస్తే ఈసారి 13 లక్షల ఎకరాలకు పైగా మాత్రమే సాగైంది. ముఖ్యంగా వరి సాగు గణనీయంగా తగ్గింది. 9 లక్షల 30 వేల ఎకరాల్లో వరి సాగు కావాల్సి ఉండగా.. 6 లక్షల 40 వేల ఎకరాల్లో మాత్రమే సాగైంది. 3 లక్షల ఎకరాలకు పైగా సాగు విస్తీర్ణం తగ్గింది. నారుమళ్లు పోసి నీరు లేక నాట్లు వేయలేకపోయిన రైతులు ఒకవైపు.. నాట్లు వేసి పంటను కాపాడుకోలేకపోతున్న

........(తరువాయి 2లో)

# పదవికో రేటు.. పనికో వాటా?

## వరంగల్ జిల్లాలో ఓ ఎమ్మెల్యే పనితీరుపై ఆరోపణలు

- బేరసారాలతోనే నామినేటెడ్ పదవులు కేటాయిస్తున్నట్లుగా విమర్శలు
- సహకార సంఘాల చైర్మన్ పదవులపై కమ్ముకుంటున్న నీలిమేఘాలు
- స్థాయిని బట్టి రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు డిమాండ్ అంటూ గుసగుసలు
- ఆరు సహకార సంఘాలకు చైర్మన్ల నియామకంతో ముదిరిన చర్చ
- అభివృద్ధి పనుల ప్రొసీడింగ్స్‌లో 5 శాతం వాటా అంటూ ప్రచారం
- కొత్తవారికే ప్రాధాన్యం.. పాత కాంగ్రెస్ క్యాడర్‌లో అసంతృప్తి..!
- వ్యవహారాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లేందుకు రంగం సిద్ధం



కాకతీయ నిఘా

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఓ నియోజకవర్గంలో ఎమ్మెల్యే చుట్టూ రాజకీయ అసంతృప్తితోపాటు పదవులు, పనులు, వసూళ్ల వ్యవహారమే ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. నామినేటెడ్ పదవుల కేటాయింపు నుంచి వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్ పదవుల వరకు బేరసారాలు సాగాయన్న ప్రచారం కాంగ్రెస్ అంతర్గత రాజకీయాలను వేడెక్కిస్తోంది. పదవి స్థాయిని బట్టి రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు డిమాండ్లు జరిగినట్లు విశ్వసనీయ సమాచారం చక్కర్లు కొడుతోంది. ఇప్పటికే 12 వ్యవసాయ సహకార సంఘాలకు గాను 6 సంఘాల చైర్మన్ల ఎన్నికలు పూర్తికావడంతో ఈ వ్యవహారంపై చర్చ మరింత జోరందుకున్నట్లు తెలుస్తోంది. దీనికితోడు ప్రత్యేక అభివృద్ధి నిధులతో చేపడుతున్న పనుల ప్రొసీడింగ్స్‌లో 5 శాతం వాటా నడుస్తోందన్న ప్రచారం, ప్రభుత్వ కార్యాలయాల్లో ఎమ్మెల్యే కుమారుడి జోక్యంపై గుసగుసలు, పాత కాంగ్రెస్ క్యాడర్‌ను పక్కనపెట్టి కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికే ప్రాధాన్యం ఇస్తున్నారన్న అసంతృప్తి.. ఇలా ఒక్కో అంశం రాజకీయంగా కాక రేపుతోంది.

**పదవులకూ రేటు కడుతున్నారా?**

నామినేటెడ్ పదవుల భర్తీ మొదలైనప్పటి నుంచే బేరసారాల వ్యవహారంపై నియోజకవర్గంలో అంతర్గత చర్చ మొదలైంది. మండల కాంగ్రెస్ అధ్యక్షుల నియామకాల సమయంలోనూ ఇదే తరహా ప్రచారం జరిగినట్లు సమాచారం.

........(తరువాయి 2లో)

## జీవో 1181 దెబ్బ.. 470 కుటుంబాల్లో కల్లోలం!

- పేరు మారింది.. పని అదే.. జీతంలో కోత
- రూ.500 నుంచి రూ.15 వేల వరకు వేతన వ్యత్యాసం
- ఏళ్ల అనుభవానికి గుర్తింపు ఏదీ?
- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మియాపురం శ్రీకాంత్ డిమాండ్



2

## రేవంత్‌ది అబద్ధాల పాలన

- 6 గ్యారెంటీలు.. 420 హామీల అమలేది?
- సిరిసిల్ల పర్యటన బీఆర్ఎస్ శ్రేణులపై దాడిలా మారింది
- నేతన్నలను మళ్లీ రోడ్డున పడేశారు
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



2

# పరాయి పాలన వచ్చింది!

- ప్రశ్నార్థకంగా తెలంగాణ అస్తిత్వం
- తెలంగాణ నీళ్లు ఆంధ్రాకు తరలిపోతున్నాయి
- ఉద్యోగాలు మనవే.. మార్కులు వేసేది ఆంధ్రావాళ్లు
- వరంగల్ నుంచే తెలంగాణ అస్తిత్వ పరిరక్షణ పోరాటం
- మామునూరు ఎయిర్‌పోర్టుకు ప్రొఫెసర్ జయశంకర్ పేరు పెట్టాలి
- తెలంగాణ అస్తిత్వ వేదిక చైర్మన్ వీరమళ్ల ప్రకాష్



**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో స్వయం పాలన పోయి.. పరాయి పాలన వచ్చిందని, రాష్ట్రం మనదే అయినా పాలన మాత్రం ఆంధ్రా కనుసన్నల్లోనే సాగుతోందని తెలంగాణ అస్తిత్వ వేదిక చైర్మన్ వీరమళ్ల ప్రకాష్ అన్నారు. తెలంగాణ అస్తిత్వమే మళ్లీ ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ నీళ్లు ఆంధ్రాకు తరలిపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఉద్యోగాలు తెలంగాణ యువతవే అయినా.. మార్కులు వేసేది ఆంధ్రావాళ్లేనని వ్యాఖ్యానించారు. తెలంగాణ అస్తిత్వాన్ని, సంస్కృతిని, వనరులను కాపాడుకునేందుకు వరంగల్ నుంచే మరో ఉద్యమ స్ఫూర్తితో పోరాటం ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. ఆర్గనైజేషన్ ఫర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ చైర్మన్, కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం హనుమకొండ హంటర్‌రోడ్డులోని మాస్టర్‌జీ డిగ్రీ, పీజీ కళాశాల ఆడిటోరియంలో తెలంగాణ అస్తిత్వ వేదిక రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వేదిక చైర్మన్ వీరమళ్ల ప్రకాష్, విశిష్ట అతిథిగా తెలంగాణ పొలిటికల్ జేఏసీ కన్వీనర్ కారం రవీందర్‌రెడ్డి, అతిథిగా సమన్వయకర్త శ్రీధర్ దేశ్‌పాండే పాల్గొన్నారు. మహాత్మాగాంధీ, ప్రొఫెసర్ జయశంకర్, నల్ల నరసింహులు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజా కళాకారుడు, ఉపాధ్యాయుడు, సాహితీవేత్త, జీవిత సాఫల్య పురస్కార గ్రహీత వల్లంపట్ల నాగేశ్వరరావును ఘనంగా సన్మానించారు.

**తెలంగాణ పాలనపై పెత్తనం ఎందుకు**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా పాలనలో పూర్తి స్వయం ప్రతిపత్తి కనిపించడం లేదని ప్రకాష్ అన్నారు. గతంలో పాలనాపరమైన నిర్ణయాలు

........(తరువాయి 2లో)

# జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

- టీడీఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కిరణ్ కుమార్
- డిజిటల్ మీడియా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి
- టీడీఎంయూ రాష్ట్ర కార్యదర్శి పల్లెబోయిన నాగరాజు





**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** జర్నలిస్టుల హక్కులు, భద్రత, సంక్షేమానికి సంబంధించిన దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ డిజిటల్ మీడియా యూనియన్ అధ్యక్షుడు ఆరెల్లి కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సమాజంలో డిజిటల్ మీడియా హవా కొనసాగుతున్న ప్రస్తుత తరుణంలో మీడియా రంగానికి సంబంధించిన విధానపరమైన సిఫార్సులు చేసేందుకు ప్రత్యేకంగా కొత్త మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. శుక్రవారం హన్మకొండలో జరిగిన యూనియన్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక కేంద్ర చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రింట్, ప్రసార, డిజిటల్ మీడియా ఉద్యోగులకు వర్తించేలా కొత్త వేతన బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం సంఘం కార్యదర్శి పల్లెబోయిన నాగరాజు మాట్లాడుతూ ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా అనే వ్యత్యాసాలు లేకుండా అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు వైద్య సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ప్రధాన జర్నలిస్టు సంఘాలు విఫలమయ్యాయని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. డిజిటల్ మీడియా జర్నలిస్టుల సమస్యలను కూడా పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం సమగ్ర విధానాన్ని రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ సలహాదారు రాజేశ్వరరావు, కోశాధికారి వంశీ, ఉపాధ్యక్షుడు మోహన్ రావు, సహాయ కార్యదర్శి నగేష్ గౌడ్, కార్యవర్గ సభ్యులు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

# పదవికో రేటు.. పనికో వాటా?

(మొదటిపేజీ తరువాయి)

అప్పట్లో ఎమ్మెల్యే రాజకీయాలకు కొత్త కావడంతో క్యాడర్ పెద్దగా పట్టించుకోలేదని తెలుస్తోంది. ఇప్పుడు వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్ పదవుల కేటాయింపులోనూ డబ్బుల వ్యవహారం తెరపైకి రావడంతో గతంలో జరిగిన ప్రచారాన్ని కూడా కాంగ్రెస్ సీనియర్లు గుర్తుచేసుకుంటున్నట్లు సమాచారం. పదవి స్థాయిని బట్టి రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు బేరాలు నడుస్తున్నాయన్న చర్చ ఇప్పుడు నియోజకవర్గ రాజకీయాల్లో ప్రధాన అంశంగా మారింది. నియోజకవర్గ పరిధిలో 12 వ్యవసాయ సహకార సంఘాలు ఉండగా ఇప్పటి వరకు 6 సంఘాల్లో చైర్మన్ల ఎన్నిక పూర్తయినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఒక్కో చైర్మన్ పదవికి రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు డిమాండ్ జరిగిందన్న ప్రచారం ఊపందుకుంది. రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ముట్టజెప్పిన వారికే కొన్ని సంఘాల్లో చైర్మన్ పదవులు దక్కాయన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గ కేంద్రానికి సంబంధించిన కీలక చైర్మన్ పదవికి రూ.20 లక్షల వరకు వ్యవహారం నడిచిందన్న ప్రచారం కూడా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే డబ్బులు చేతులు మారినట్లు అధికారికంగా ఎలాంటి నిర్ధారణ లేకపోయినా.. ఎన్నికైన వారి రాజకీయ, ఆర్థిక నేపథ్యాలను బేరసారాల ప్రచారంతో ముడిపెట్టి కాంగ్రెస్‌లో చర్చ జరుగుతోంది. వ్యవసాయ సహకార సంఘాల పదవులు రైతులతో ప్రత్యక్ష సంబంధం ఉన్న వారికి దక్కాల్సి ఉండగా, వ్యాపార నేపథ్యం ఉన్న వారికి కొన్ని చోట్ల ప్రాధాన్యం లభించిందన్న చర్చ కూడా మొదలైంది. ఆర్థిక స్థోమత, రాజకీయ పలుకుబడి ఉన్నవారికే కీలక పదవులు దక్కడం వెనుక ఏం జరిగిందన్న ప్రశ్నలు తలెత్తుతున్నట్లు తెలుస్తోంది. రైతు ప్రయోజనాల కోసం పనిచేయాల్సిన సహకార సంఘాల్లో రాజకీయ విధేయత, ఆర్థిక సామర్థ్యమే ప్రమాణాలుగా మారుతున్నాయన్న చర్చ బేరసారాల ప్రచారానికి మరింత ఊతమిస్తున్నట్లు సమాచారం.

**పనుల ప్రొసీడింగ్స్‌లో 5 శాతం వాటా?**

నామినేటెడ్ పదవులకే పరిమితం కాకుండా అభివృద్ధి పనుల విషయంలోనూ వసూళ్ల ప్రచారం సాగుతున్నట్లు తెలుస్తోంది. ప్రత్యేక అభివృద్ధి నిధులతో చేపడుతున్న పనుల ప్రొసీడింగ్స్‌లో 5 శాతం వాటా నడుస్తోందన్న టాక్ నియోజకవర్గంలో చక్కర్లు కొడుతోంది. పనులు పొందాలంటే నిర్దిష్ట వాటా ఇవ్వాల్సి వస్తోందన్న ప్రచారం నిజమెంత అన్నది తేలాల్సి ఉన్నప్పటికీ.. ఈ వ్యవహారం రాజకీయంగా మాత్రం తీవ్ర చర్చకు దారితీస్తోంది. పదవుల కేటాయింపు, పనుల మంజూరు రెండింటి విషయంలోనూ డబ్బుల ప్రస్తావన రావడం కాంగ్రెస్ క్యాడర్‌లో అసంతృప్తిని మరింత పెంచుతున్నట్లు తెలుస్తోంది. గ్రామాల్లో ఉపాధి హామీ నిధులు, మెటీరియల్ కాంపోనెంట్ పనుల కేటాయింపుపైనా విమర్శలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యేకు నచ్చిన కార్యకర్తలు ఉన్న గ్రామాలకు పనుల కేటాయింపులో ప్రాధాన్యం లభిస్తోందని, అనుకూలంగా లేని గ్రామాలకు నిధులు రావడం లేదన్న చర్చ సాగుతోంది. గ్రామాల్లో అభివృద్ధి పనులను రాజకీయ విధేయతతో ముడిపెడుతున్నారన్న అసంతృప్తి కూడా ఉన్నట్లు సమాచారం. దీనికితోడు ప్రభుత్వ కార్యాలయాల్లో ఎమ్మెల్యే కుమారుడి జోక్యం పెరిగిందన్న గుసగుసలు నియోజకవర్గంలో వినిపిస్తున్నాయి. అధికారులతో వ్యవహారాలు, పనులకు సంబంధించిన అంశాల్లో ఆయన ప్రమేయం ఉంటోందన్న చర్చ సాగుతున్నట్లు తెలుస్తోంది.

**పాత క్యాడర్‌కు దక్కని గుర్తింపు**

మొదటి నుంచీ కాంగ్రెస్ కోసం పనిచేసిన వారిని పక్కనపెట్టి కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికి ప్రాధాన్యం ఇస్తున్నారన్న అసంతృప్తి క్రమంగా బయటకు వస్తున్నట్లు సమాచారం. పదేళ్లపాటు పార్టీ కోసం కష్టపడిన వారిని కనీసం గుర్తించడం లేదన్న ఆగ్రహం సీనియర్ క్యాడర్‌లో పెరుగుతున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో క్షేత్ర స్థాయిలో పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు పదవులు, పనుల్లో తగిన ప్రాధాన్యం లేకపోవడం పాత కాంగ్రెస్ నేతలను అసంతృప్తికి గురిచేస్తున్నట్లు సమాచారం. కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికే దగ్గరగా ఉంటూ.. మొదటి నుంచీ పార్టీని మోసిన వారిని పట్టించుకోవడం లేదన్న భావన బలపడుతున్నట్లు తెలుస్తోంది.

**సొంత నియోజకవర్గంలో కంటే బయటే ఎక్కువా?**

సదరు నేత నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో విస్తృతంగా పర్యటించకపోయినా అప్పటి కాంగ్రెస్ అనుకూల పరిస్థితులతోపాటు క్షేత్ర స్థాయిలో పార్టీ క్యాడర్ చేసిన కృషి విజయానికి దోహదపడిందన్న అభిప్రాయం ఉంది. అయితే ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత సొంత నియోజకవర్గంలో కంటే పక్క నియోజకవర్గాల్లోనే ఎక్కువగా కనిపిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నట్లు సమాచారం. మొదట్లో రాజకీయాలకు కొత్త కావడంతో ఇతర ఎమ్మెల్యేల పనితీరును పరిశీలించేందుకు వారి సమావేశాలకు వెళ్తున్నారని కాంగ్రెస్ శ్రేణులు భావించినట్లు తెలుస్తోంది. అయితే కాలం గడుస్తున్నా సొంత నియోజకవర్గానికి ఎక్కువ సమయం కేటాయించడం లేదన్న అసంతృప్తి పెరుగుతోంది. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అరుదుగా అందుబాటులో ఉంటున్నారన్న చర్చ కూడా కొనసాగుతోంది.

**సీనియర్లను గుర్తుపట్టని పరిస్థితి**

ఎన్నికల సమయంలో పార్టీ కోసం పనిచేసిన సీనియర్ నాయకులను ఎమ్మెల్యే ఇప్పటికీ గుర్తుపట్టడం లేదన్న ఆవేదన కూడా కాంగ్రెస్‌లో వ్యక్తమవుతున్నట్లు సమాచారం. గ్రామస్తులు, ద్వితీయశ్రేణి నాయకులను వెంటబెట్టుకుని ఎమ్మెల్యే వద్దకు వెళ్లిన సందర్భాల్లోనే సీనియర్ కార్యకర్తలను వారి గ్రామం, పేరు అడగాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎన్నికల తొలినాళ్లలో రాజకీయాలకు కొత్త కావడంతో సహజమేనని భావించినా.. ఎమ్మెల్యేగా గెలిచి మూడేళ్లు కావస్తున్నా పార్టీ కోసం పనిచేసిన వారిని గుర్తించకపోవడాన్ని సీనియర్లు జీర్ణించుకోలేకపోతున్నట్లు తెలుస్తోంది. ఇతర నియోజకవర్గాల నేతలు తమను గుర్తించి పలకరిస్తున్నా.. సొంత ఎమ్మెల్యే మాత్రం పట్టించుకోవడం లేదన్న భావన బలపడుతున్నట్లు సమాచారం.

**అధిష్ఠానం దృష్టికి పంచాయితీ?**

ఇన్నాళ్లు ఎమ్మెల్యే రాజకీయాలకు కొత్త అన్న కారణంతో ఓపికగా ఉన్నామని.. ఇకపై ఇదే పరిస్థితిని సహించేది లేదన్న భావన కొందరు సీనియర్ కాంగ్రెస్ నాయకుల్లో బలపడినట్లు విశ్వసనీయ సమాచారం. నామినేటెడ్ పదవుల కేటాయింపు, సహకార సంఘాల చైర్మన్ పదవులు, అభివృద్ధి పనుల ప్రొసీడింగ్స్, ఉపాధి హామీ నిధులు, క్యాడర్‌తో ఎమ్మెల్యే వ్యవహరిస్తున్న తీరు వంటి అంశాలను పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లేందుకు కొందరు సీనియర్లు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ అంశాలపై అంతర్గతంగా చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. మొత్తంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఓ నియోజకవర్గంలో 'పదవులు-పనులు-వసూళ్లు' వ్యవహారమే రాజకీయ హాట్‌టాపిక్‌గా మారింది. మండల అధ్యక్ష పదవుల నుంచి సహకార సంఘాల చైర్మన్ కుర్చీల వరకు బేరసారాల ప్రచారం, అభివృద్ధి పనుల్లో వాటా అంటూ వినిపిస్తున్న మాటలు, ఉపాధి పనుల కేటాయింపుపై విమర్శలు, ప్రభుత్వ కార్యాలయాల్లో కుటుంబ సభ్యుల జోక్యంపై గుసగుసలు.. అన్నీ కలిసి ఎమ్మెల్యే చుట్టూ రాజకీయ వేడి పెంచుతున్నట్లు తెలుస్తోంది. దీనికితోడు పాత కాంగ్రెస్ క్యాడర్ అసంతృప్తి, కొత్తగా వచ్చిన వారికి ప్రాధాన్యం, ఎమ్మెల్యే అందుబాటుపై ఉన్న అసంతృప్తి ఒక్కటవుతున్నాయి. ఈ పరిణామాలన్నీ చివరకు పార్టీ అధిష్ఠానం దృష్టికి వెళ్లి రాజకీయ పంచాయితీగా మారుతాయా.. లేక ఎమ్మెల్యే క్యాడర్‌లో పెరుగుతున్న అసంతృప్తిని గుర్తించి పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేస్తారా అన్నది ఇప్పుడు ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.



# జీవో 1181 దెబ్బ.. 470 కుటుంబాల్లో కల్లోలం!

- **పేరు మారింది.. పని అదే.. జీతంలో కోత**
- **రూ.500 నుంచి రూ.15 వేల వరకు వేతన వ్యత్యాసం**
- **ఏళ్ల అనుభవానికి గుర్తింపు ఏదీ?**
- **ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మియాపురం శ్రీకాంత్ డిమాండ్**

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** ప్రభుత్వ శాఖల్లో ఏళ్లుగా పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీవో 1181 కొత్త చిక్కులు తెచ్చిపెట్టిందని ఉద్యోగ సంఘాలు పేర్కొంటున్నాయి. వేతనాలు పెరుగుతాయని ఆశించిన సమయంలోనే కేటగిరీల మార్పు పేరుతో ఉన్న జీతాల్లో కోత పడుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. గ్రేటర్ వరంగల్ పరిధిలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న సుమారు 470 మంది ఉద్యోగులపై ప్రభావం పడుతోందని చెబుతున్నాయి. కేటగిరీలను మార్చడంతో రూ.500 నుంచి రూ.15 వేల వరకు వేతన వ్యత్యాసం ఏర్పడుతోందని ఉద్యోగ సంఘాలు పేర్కొంటున్నాయి. కంప్యూటర్ ఆపరేటర్లకు గతంలో రూ.22,750 వేతనం ఉండగా రూ.19,500కు తగ్గుతోందని, దీంతో నెలకు రూ.3,250 కోత పడుతోందని చెబుతున్నారు. 40 మంది కంప్యూటర్ ఆపరేటర్లపై ప్రభావం ఉంటుందని పేర్కొంటున్నారు. ప్రైవేట్ జవాన్లకు రూ.17 వేల నుంచి రూ.16,500కు, డీఏఎఫ్ సిబ్బందికి రూ.19,500 నుంచి రూ.16,500కు వేతనం తగ్గుతోందని ఉద్యోగ సంఘాలు వెల్లడించాయి. ఫిల్టర్ బెడ్, ఎలక్ట్రికల్ సిబ్బందికి కూడా వేతన వ్యత్యాసాలు ఏర్పడుతున్నాయని తెలిపాయి.

**పని మారలేదు.. వేతనం ఎందుకు తగ్గాలి?**

కేటగిరీల పేర్లు మార్చినా ఉద్యోగుల విధులు, బాధ్యతలు, పని గంటల్లో ఎలాంటి మార్పు లేదని సిబ్బంది వాపోతున్నారు. కంప్యూటర్ ఆపరేటర్ పేరును మార్చినా కంప్యూటర్ పనినే చేస్తున్నారని, డ్రైవర్ హోదా మారినా వాహనాన్ని నడపాల్సింది వారేనని పేర్కొంటున్నారు. పని అదే అయినప్పుడు వేతనం ఎందుకు తగ్గిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. జీవో 1181లో కేటగిరీల వారీగా వేతనాల నిర్ణయానికి ప్రాతిపదిక ఏమిటి, ఉద్యోగుల సీనియారిటీ, అనుభవాన్ని పరిగణనలోకి తీసుకున్నారా అనే అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఉద్యోగులు కోరుతున్నారు. వేతనాల్లో కోతకు కారణమైన జీవోను రద్దు చేయాలని లేదా పునఃసమీక్షించాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ డిమాండ్ చేస్తోంది.

**జీవో రద్దు చేయకుంటే ఉద్యమమే.. జేఏసీ**

వేతనాల కోతకు కారణమైన జీవో 1,181ని వెంటనే రద్దు చేయాలని లేదా పునఃసమీక్షించాలని ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ డిమాండ్ చేస్తోంది. సమస్య పరిష్కారానికి ప్రత్యేక కమిటీ వేసి, సంఘాలతో చర్చించి భరోసా కల్పించాలని కోరుతోంది. "ప్రస్తుతం ఇస్తున్న వేతనాలనే కొనసాగించాలి. జీవో 1181ను రద్దు చేయాలి లేదా పునఃసమీక్షించాలి. ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి ఉద్యోగ సంఘాలతో చర్చించాలి." అని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మియాపురం శ్రీకాంత్ డిమాండ్ చేశారు.

# రేవంత్‌ది అబద్ధాల పాలన

**కాకతీయ, కరీంనగర్ :** ఇచ్చిన హామీలు నెరవేర్చలేక కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై వ్యక్తిగత విమర్శలు చేయడమే రేవంత్‌రెడ్డి పనిగా మారిందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి బీఆర్ఎస్ నేతలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శుభ మంగళి బ్యాంకెట్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి సిరిసిల్ల పర్యటన సందర్భంగా బీఆర్ఎస్ కార్యకర్తలను ముందస్తుగా అరెస్టు చేయడాన్ని కొప్పుల ఈశ్వర్ తప్పుబట్టారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 35 నెలలు గడుస్తున్నా 6 గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయలేదన్నారు. రైతులకు సాగునీరు, యూరియా అందడం లేదని, వడ్ల కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో బతుకమ్మ చీరలు, విద్యార్థుల యూనిఫాంల ఆర్డర్లు నేరుగా సిరిసిల్ల పవర్‌లూమ్ కార్మికులకు ఇచ్చారని కొప్పుల ఈశ్వర్ గుర్తుచేశారు. నూలుపై 40 శాతం సబ్సిడీ, చేనేత మిత్ర, నేతన్నకు చేయూత, బీమా వంటి పథకాలతో నేతన్నలకు అండగా నిలిచారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వకపోవడంతోపాటు పాత బకాయిలు చెల్లించక నేత కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ పాలనలో నేతన్నల ఆత్మహత్యలతో సిరిసిల్లను 'ఉరిసిల్ల'గా మార్చిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో సిరిసిల్లను జిల్లాగా ఏర్పాటు చేసి కలెక్టరేట్, విద్యాసంస్థలు, మౌలిక వసతులు కల్పించారని తెలిపారు.

**దళిత బంధు ఎందుకు నిలిపివేశారు?**

కేసీఆర్ ప్రభుత్వం దళిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున దళితబంధు అందిస్తే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత దాన్ని నిలిపివేసిందని కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన రూ.12 లక్షల అంబేద్కర్ అభయహస్తం ఏమైందో దళిత మంత్రులు, ఎమ్మెల్యేలు రేవంత్‌రెడ్డిని ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. గల్ఫ్ సంక్షేమ బోర్డు, రూ.5 లక్షల ప్రమాద బీమా హామీలు కూడా అమలుకు నోచుకోలేదన్నారు. సిరిసిల్ల ప్రజలు కేటీఆర్‌ను 6 సార్లు ఎమ్మెల్యేగా ఎన్నుకున్నారని, ఆయనను వలసవాది అనడం ప్రజల ప్రజాస్వామ్య తీర్పును అవమానించడమేనని కొప్పుల ఈశ్వర్ అన్నారు. రేవంత్‌రెడ్డి సభ ముగిసిన 2 రోజులకే రాజన్న సిరిసిల్ల జిల్లాలో బ్రిటిష్ కాలం నాటి పోలీస్ చట్టంలోని సెక్షన్ 30 అమలు చేయడం నిరంకుశ విధానానికి నిదర్శనమని ఆరోపించారు. సిరిసిల్లకు, తెలంగాణకు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఒక్క ప్రాజెక్టు లేదా పరిశ్రమ ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్, మాజీ జెడ్పీటీసీ తన్నీరు శరత్‌రావు, హరిచరణ్‌రావు, కార్పొరేటర్లు గుగ్గిళ్ల జయశ్రీ శ్రీనివాస్, మల్లేశం, మాజీ కార్పొరేటర్ ఉమాపతి, నేతి రవివర్మ, కర్ర సూర్యశేఖర్, ముత్యాల బలరాంరెడ్డి, ఏలేటి కృష్ణారెడ్డి, ఇరుగురాల ఆనందం, రాజు అంజనేయులు, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

(మొదటిపేజీ తరువాయి)

పురస్కరించుకుని శుక్రవారం పబ్లిక్ గార్డెన్‌లోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి డిమాండ్ల దినోత్సవం నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జర్నలిస్టుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయికి అందజేశారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజులను కలిసి వినతిపత్రాలు సమర్పించారు.

**మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి**

మారుతున్న మీడియా రంగ పరిస్థితులను సమగ్రంగా సమీక్షించి విధానపరమైన సిఫార్సులు చేసేందుకు కొత్త మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మీడియా సిబ్బంది, వార్తా సంస్థల భద్రతకు ప్రత్యేక కేంద్ర చట్టం తీసుకురావాలని కోరారు. కొత్త కార్మిక చట్టాల్లో విలీనమైన 1955, 1958 నాటి వర్కింగ్ జర్నలిస్టుల ప్రత్యేక చట్టాల ద్వారా గతంలో కల్పించిన హక్కులు, ఉద్యోగ భద్రత, పని గంటలు, వివాద పరిష్కారం, సేవల విరమణకు సంబంధించిన రక్షణలను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రింట్, ప్రసార, డిజిటల్ మీడియా ఉద్యోగులకు వర్తించేలా కొత్త వేతన బోర్డును వెంటనే ఏర్పాటు చేసి ద్రవ్యోల్బణానికి అనుగుణంగా వేతనాలను సిఫార్సు చేయాలని కోరారు. రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వైద్య సదుపాయాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

**143 యూనియన్‌పై విమర్శలు**

ఐజేయూ చేస్తున్న ఆందోళనను గమనించి 143 యూనియన్ నాయకులు పోస్టు కార్డుల పేరుతో కొత్త నాటకానికి తెరలేపారని విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించి, ఇప్పుడు జర్నలిస్టులకు నీతులు చెప్పడం సిగ్గుచేటన్నారు. నిత్యం పాలాభిషేకాలతో కాలం గడిపి జర్నలిస్టుల సమస్యలను పట్టించుకోని వారిని జర్నలిస్టులు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, కార్యదర్శి ఊటుకూరు సాయిరామ్, రాష్ట్ర హౌసింగ్ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ వల్లాల వెంకటరమణ, నేషనల్ కౌన్సిల్ సభ్యులు పీవీ మదన్ మోహన్, గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంకణాల సంతోష్, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య, జిల్లా కోశాధికారి పొడిశెట్టి విష్ణువర్ధన్, ప్రెస్‌క్లబ్ కోశాధికారి బోల్ల అమర్, నాయకులు నల్లాల బుచ్చిరెడ్డి, ఎం. రాజేంద్ర ప్రసాద్, విజయ్ భాస్కర్, గన్ను సంతోష్‌కుమార్, ఉస్మాన్ పాషా, ఎం.ఎ.వాజీద్, దండు మోహన్, ఏ. కొమ్మాలు, బిక్షపతి యాదవ్, నయీమ్ పాషా, బొజ్జం చొక్కారావు, కత్తి రాజు, రమేష్, ముదిగిరి ఓదెలు, ప్రమోద్, అల్లే రామారావు, ప్రదీప్, బి. శ్రీహరి రాజు, శాగంటి శ్రీనివాస్, పి. కిషోర్, కుక్కల రాజు, శోభన్‌బాబు, వంగ రమేష్, గోలి రవి, రాకేష్, మోయిన్ తదితరులు పాల్గొన్నారు.

# చినుకు కోసం.. చేను చూపు

(మొదటిపేజీ తరువాయి)

రైతులు మరోవైపు కనిపిస్తున్నారు. వర్షం కోసం ఆకాశం వైపు చూస్తూ అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

**268 గ్రామాల్లో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు**

వర్షాభావ తీవ్రత గ్రామాల స్థాయిలోనూ స్పష్టంగా కనిపిస్తోంది. అధికారుల లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లా పరిధిలో 268 గ్రామాల్లో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. మరో 734 గ్రామాల్లో మధ్యస్థ కరువు పరిస్థితులు ఉన్నట్లు సమాచారం. వర్షాలు లేకపోవడంతో భూగర్భ జలమట్టాలు తగ్గిపోతున్నాయి. బావుల్లోకి నీరు చేరడం లేదు. బోరుబావుల్లోనూ నీటి లభ్యత తగ్గుతోంది. దీంతో సాగు చేసిన పంటలకు చివరి దశలో నీరు అందించడమే రైతులకు పెద్ద సవాలుగా మారింది. ముఖ్యంగా జనగామ, హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు మరింత ఆందోళనకరంగా ఉన్నాయి. పంటను కాపాడుకునేందుకు రైతులు బోర్లు, బావులు, ఇతర నీటి వనరులపై ఆధారపడుతున్నారు. నీటి వనరులు సహకరించకపోతే పంటను వదిలేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

**6284 చెరువుల్లో నిండింది కొన్నే**

ఉమ్మడి వరంగల్ పరిధిలో మొత్తం 6284 చెరువులు ఉన్నాయి. వరంగల్‌లో 1074, హనుమకొండలో 677, జనగామలో 871, మహబూబాబాద్‌లో 1661, ములుగులో 923, జయశంకర్ భూపాలపల్లిలో 1078 చెరువులు ఉన్నాయి. వీటిలో సుమారు 30 శాతం చెరువులు మాత్రమే పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకున్నాయి. మరో 70 శాతం చెరువుల్లో సగం వరకు మాత్రమే నీరు ఉంది. భారీ వర్షాలు లేకపోవడంతో చెరువుల్లోకి ఆశించిన స్థాయిలో నీరు చేరలేదు. కొన్ని ప్రాంతాల్లో ఆలస్యంగా నీరు చేరినా.. పంటలకు అవసరమైన సమయంలో అందుబాటులోకి రాకపోవడంతో రైతులకు ప్రయోజనం లేకుండా పోతోంది. చెరువుల కింద సాగు చేసే రైతులు నీటి విడుదల కోసం ఎదురుచూస్తున్నారు. మరోవైపు చెరువుల్లో నీటి నిల్వ తక్కువగా ఉండటంతో తదుపరి పంటల సాగుపైనా అనిశ్చితి నెలకొంది.

**వర్షం లేక.. పంటపై ఆశలు ఆవిరి**

సాగు విస్తీర్ణం తగ్గడంతోపాటు ఇప్పటికే వేసిన పంటలను కాపాడుకోవడం రైతులకు కష్టంగా మారింది. వరి నాట్లు వేసిన పొలాల్లో నీటి తడులు లేకపోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. నారుమళ్లు పోసిన తర్వాత వర్షాలు లేకపోవడంతో నాట్లు వేయలేకపోయిన పరిస్థితులు కూడా ఉన్నాయి. దీంతో ఒక దశలో సాగుకు సిద్ధమైన భూమి.. మరో దశలో బీడుగా మారుతోంది. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, దుక్కులు, కూలీల కోసం పెట్టుబడి పెట్టిన రైతులకు పంట చేతికి రాకపోతే నష్టం మరింత పెరగనుంది. సాగు చేసిన పంటను కాపాడుకునేందుకు అదనంగా నీటిని సమకూర్చుకోవాల్సి వస్తుండటంతో పెట్టుబడి భారం పెరుగుతోంది. వర్షం కోసం ఎదురు చూడటం తప్ప రైతులకు మరో మార్గం కనిపించడం లేదు.

**పత్తికీ చీడపీడల బెడద**

వరి సాగు సాధ్యం కాని ప్రాంతాల్లో పత్తిపై ఆశలు పెట్టుకున్న రైతులకు కూడా వర్షాభావం సమస్యగా మారింది. సరిపడా వర్షాలు లేకపోవడంతో పత్తి మొక్కల ఎదుగుదలపై ప్రభావం పడుతోంది. తేమ తగ్గడంతో చీడపీడల బెడద పెరుగుతోంది. ముఖ్యంగా రసం పీల్చే తెగుళ్లు పూత, కాతపై ప్రభావం చూపుతున్నాయని రైతులు చెబుతున్నారు. దీంతో దిగుబడి తగ్గే ప్రమాదం ఏర్పడింది. ఒక పంటకు నీరు లేక ఇబ్బంది పడుతుంటే.. మరో పంటకు చీడపీడలు వెంటాడుతున్న పరిస్థితి నెలకొంది. మహబూబాబాద్, జనగామ జిల్లాల్లో వరి సాగుపై వర్షాభావ ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో కొంత మేర వర్షాలు పడినప్పటికీ పంటలకు సరిపోయే స్థాయిలో నీరు అందని ప్రాంతాలు ఉన్నాయి. దీంతో పంటల పరిస్థితిపై రైతుల్లో ఆందోళన పెరుగుతోంది.

**బయ్యారం ఆయకట్టుకు నీటి కష్టాలు**

మహబూబాబాద్ జిల్లా బయ్యారం పెద్ద చెరువును నమ్ముకుని సుమారు 15 వేల ఎకరాల్లో సాగు చేస్తున్న రైతులకు నీటి లభ్యత సమస్యగా మారింది. చెరువులో ఉన్న నీటిని పంటలకు ఎప్పుడు అందిస్తారో స్పష్టత లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే సాగు చేసిన పంటకు కీలక దశలో నీరు అందకపోతే పెట్టిన పెట్టుబడి వృథా అయ్యే ప్రమాదం ఉంది. కనీసం రెండో పంటకైనా నీరు అందిస్తారో లేదో స్పష్టత ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. నీటి లభ్యతపై ముందుగానే స్పష్టత ఉంటే రైతులు తదుపరి సాగుపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుంది. చెరువులో ఉన్న నీటి నిల్వను పరిగణనలోకి తీసుకుని ప్రస్తుత పంటను కాపాడేందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలన్న దానిపై అధికారులు రైతులకు స్పష్టమైన సమాచారం ఇవ్వాల్సి ఉంది.

**ఆకేరు చెంతనే.. ఎండిన బోర్లు**

మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలోని పలు గ్రామాల్లో వర్షాభావ పరిస్థితులు మరింత స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆకేరు వాగు సమీపంలో గ్రామాలు ఉన్నప్పటికీ బావుల్లోకి ఆశించిన స్థాయిలో నీరు చేరలేదు. బోరుబావులు ఎండిపోవడంతో పంటలను కాపాడుకోవడం రైతులకు కష్టంగా మారింది. వర్షం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. కొందరు రైతులు పంటను కాపాడుకునేందుకు అదనపు ఖర్చుతో నీటిని సమకూర్చుకుంటున్నారు. మరికొందరు పంటను పశువుల మేతకు వదిలేయాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. పంట సాగు చేయకుండానే భూమిని బీడుగా వదిలేయడం కూడా కొన్ని ప్రాంతాల్లో కనిపిస్తోంది. వర్షాలు మరింత ఆలస్యమైతే ఈ పరిస్థితి మరింత విస్తరించే అవకాశం ఉంది.

**ప్రభుత్వ భరోసా కోసం ఎదురుచూపు**

ఉమ్మడి వరంగల్ రైతాంగానికి ఈ వానాకాలం కఠిన పరీక్షగా మారింది. వర్షాలు కురవకపోవడంతో సాగు విస్తీర్ణం తగ్గింది. చెరువులు నిండకపోవడంతో ఆయకట్టు రైతుల్లో ఆందోళన పెరిగింది. భూగర్భ జలాలు పుంజుకోకపోవడంతో బోర్లు, బావులపై ఆధారపడిన రైతులకు కూడా ఇబ్బందులు తప్పడం లేదు. పంటలు వేసిన రైతులు నీటి కోసం అష్టకష్టాలు పడుతున్నారు. పంటలు వేయలేని రైతులు తదుపరి సాగుపై ఆలోచనలో పడ్డారు. ఈ పరిస్థితుల్లో వర్షాభావ ప్రభావాన్ని గ్రామాల వారీగా అంచనా వేసి పంటల పరిస్థితిపై స్పష్టమైన నివేదిక రూపొందించాల్సిన అవసరం ఉంది. ఎక్కడ పంటలు ఎండిపోతున్నాయి, ఎక్కడ నీటి వనరులు అందుబాటులో ఉన్నాయి, ఎక్కడ ఆయకట్టుకు నీరు అవసరం ఉంది అన్నది గుర్తించి చర్యలు చేపట్టాలి. ఇప్పటికే నష్టపోయిన రైతులకు అండగా నిలిచే విధానంపైనా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సి ఉంది. చినుకు కోసం చేను ఎదురుచూస్తోంది. చెరువు నిండితే పంటకు నీరు.. బావి నిండితే బోరుకు భరోసా.. వర్షం పడితేనే రైతు పెట్టుబడికి అర్థం. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో ఆ మూడింటిపైనా అనిశ్చితి నెలకొంది. ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాల్లో వర్షాభావ ప్రభావం వ్యవసాయ రంగాన్ని వెంటాడుతోంది. ఒకవైపు సాగు తగ్గిపోతుంటే.. మరోవైపు సాగు చేసిన పంటలను కాపాడుకోవడం భారంగా మారింది. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన రైతులు పంట చేతికి వస్తుందా లేదా అన్న ఆందోళనలో ఉన్నారు. వర్షం కోసం ఎదురుచూస్తున్న అన్నదాతకు ప్రకృతి కరుణతోపాటు ప్రభుత్వ భరోసా కూడా అవసరం. చేలో పంట ఉంది.. నీటి కోసం రైతు చూపు ఆకాశంపైనే ఉంది. చినుకు కురిస్తే పంట బతుకుతుంది.. లేకుంటే అన్నదాత ఆశలే ఎండిపోతాయి.

# పరాయి పాలన వచ్చింది!

(మొదటిపేజీ తరువాయి)

సచివాలయంలోనే జరిగేవని, ఇప్పుడు ఢిల్లీ నుంచో.. అమరావతి నుంచో అనుమతులు తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని విమర్శించారు. తెలంగాణ ప్రజలు పోరాడి సాధించుకున్న రాష్ట్రంపై మరోసారి పరాయి ప్రభావం పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమైక్య రాష్ట్రంలో, తెలంగాణ ఉద్యమ సమయంలో ఎదురైన పరిస్థితులే మళ్లీ కనిపిస్తున్నాయని అన్నారు. తెలంగాణ వనరులు, నీళ్లు ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నాయని ఆరోపించారు. పాలమూరు ప్రాంతం నుంచి నీటిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నా.. పాలమూరు బిడ్డగా చెప్పుకునే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు.

**కృష్ణా జలాలు ఎటు పోతున్నాయి**

జూరాల ప్రాజెక్టు నీటిని తెలంగాణ ప్రాంతానికి అందించాల్సిన పరిస్థితిలో పోతిరెడ్డిపాడు ద్వారా నెల్లూరు జిల్లాలోని కండలేరు, సోమశిల ప్రాజెక్టులకు, చిత్తూరు, అనంతపురం, ఒంగోలు ప్రాంతాల్లోని రిజర్వాయర్లకు నీరు తరలిస్తున్నారని ప్రకాష్ ఆరోపించారు. కృష్ణా జలాలు నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలకు అందకుండా కుప్పం వరకు ఎలా వెళ్తున్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ నుంచి వెళ్తున్న నీటితో విజయవాడ, రాజమండ్రి ప్రాంతాల్లో పంటలు పండుతుంటే.. తెలంగాణలో రైతులు మళ్లీ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. గతంలో కేసీఆర్ హయాంలోనూ సమస్యలు ఉన్నప్పటికీ రైతులకు, ప్రజలకు అనేక సౌకర్యాలు అందాయని పేర్కొన్నారు. ఇంటింటికీ నీరు, రైతులు, పరిశ్రమలకు విద్యుత్, ఇతర సంక్షేమ కార్యక్రమాలు కొనసాగాయని చెప్పారు. ప్రస్తుత పాలనలో పరిస్థితి తిరగబడిందని విమర్శించారు. మేడిగడ్డ బ్యారేజీ వ్యవహారంపై కూడా ప్రకాష్ పలు ప్రశ్నలు లేవనెత్తారు. మేడిగడ్డను బాంబులతో పేల్చేశారని తాను గతంలో చెప్పినప్పుడు ఎవరూ నమ్మలేదని అన్నారు. 2024 జనవరిలో పెద్దపల్లి సమీపంలోని హుస్సేన్‌మియా వాగుపై చెక్‌డ్యాంలను పేల్చేస్తున్న కాంగ్రెస్ నాయకులను రైతులు పట్టుకున్నారని, దీనిపై ఇప్పటివరకు చర్యలు లేవని ఆరోపించారు. 2026లో మానేరు నదిపై 2 బ్యారేజీలు దెబ్బతిన్నాయని, సంబంధిత ఈఈ కూడా వాటిని పేల్చేశారని చెప్పినట్లు ప్రకాష్ పేర్కొన్నారు. అయితే అక్కడి ఎమ్మెల్యేలు, మంత్రులు గతంలో నిర్మించిన నాణ్యతా లోపాల కారణంగానే అవి దెబ్బతింటున్నాయని చెబుతున్నారని, వరదలు లేనప్పుడు బ్యారేజీలు ఎలా దెబ్బతింటాయని ప్రశ్నించారు. మేడిగడ్డ వ్యవహారాన్ని తెలంగాణ ప్రభుత్వం పుణెలోని సీడబ్ల్యూపీఆర్ఎస్ సంస్థకు అప్పగించిందని, ఆ సంస్థ పరిశీలనలో అన్ని బ్యారేజీలు, పిల్లర్లు బాగున్నాయని, 4 పిల్లర్లు మాత్రమే దెబ్బతిన్నాయని తేలిందని ప్రకాష్ అన్నారు. ఆ 4 పిల్లర్లు ఎందుకు దెబ్బతిన్నాయన్న అంశంపై మాత్రం స్పష్టత రావాల్సి ఉందన్నారు. ఎన్డీఎస్ఏ, ఎన్జీఆర్ఐ, విజిలెన్స్, ఇతర కమిటీలు పరిశీలించినా పిల్లర్లు ఎందుకు కుంగాయన్న కారణం తేలలేదని పేర్కొన్నారు. వరంగల్ నిట్, బాంబే ఐఐటీ ఇంజినీర్లు కూడా సర్వేలు చేసినా కారణాలు ఇప్పటికీ తేలలేదని అన్నారు. ఈ అంశంపై పూర్తి వాస్తవాలు ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు.

**మామునూరు ఎయిర్‌పోర్టుకు జయశంకర్ పేరు**

వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్టుకు ప్రొఫెసర్ జయశంకర్ పేరు పెట్టాలని ప్రకాష్ డిమాండ్ చేశారు. తెలంగాణ అస్తిత్వ పోరాటానికి ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తిగా నిలిచారని, ఆయన పేరును మామునూరు విమానాశ్రయానికి పెట్టడం సముచితమని అన్నారు. తెలంగాణ అస్తిత్వ పరిరక్షణ కోసం పోరాడే వారికి అస్తిత్వ వేదిక గురువులా, మార్గదర్శిగా ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణ అస్తిత్వ పోరాటానికి ఓరుగల్లు నాయకత్వం వహించాల్సిన అవసరం ఉందన్నారు. రామప్ప ఆలయ పరిరక్షణకు అస్తిత్వ వేదిక ముందుంటుందని స్పష్టం చేశారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, వారసత్వాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా పేర్కొన్నారు. తెలంగాణ అస్తిత్వం మళ్లీ ప్రశ్నార్థకంగా మారిందని ఓబీసీ చైర్మన్, కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ అన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినా అన్ని రంగాల్లో సమాన అభివృద్ధి జరగలేదని, ఎస్సీ, ఎస్టీ, బీసీల పరిస్థితి అధ్వానంగా మారిందని పేర్కొన్నారు. హైదరాబాద్ నడిబొడ్డున ఆంధ్రా పాలకులు, నేతల విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారని, అమరావతి నుంచి ఆదేశాలు వస్తే వారి విగ్రహాలను పెడుతున్నారని విమర్శించారు. తెలంగాణ గద్దర్, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయడానికి అక్కడి పాలకులు అనుమతిస్తారా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దమ్ముంటే విజయవాడలో గద్దర్, జయశంకర్ విగ్రహాలను ఏర్పాటు చేయించాలని డిమాండ్ చేశారు. పాలకులు తెలంగాణకు చెందినవారైనా.. వారిని నడిపించేది ఆంధ్రావాళ్లేనని ఆరోపించారు. తెలంగాణ వనరులను తెలంగాణ ప్రజలే కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమంలో పోరాడిన స్ఫూర్తితో అస్తిత్వ వేదిక పనిచేస్తుందని, వరంగల్ నుంచే తెలంగాణ అస్తిత్వ పరిరక్షణ పోరాటం ప్రారంభమవుతుందని స్పష్టం చేశారు.

**తెలంగాణ వనరులపై దోపిడీ ఆపాలి**

తెలంగాణ వనరులు దోపిడీకి గురవుతున్నాయని తెలంగాణ అస్తిత్వ వేదిక సమన్వయకర్త శ్రీధర్ దేశ్‌పాండే అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం ఉద్యమకారుల ఆలోచనలతో రూపుదిద్దుకుందని, అయితే దాని రూపంతోపాటు తెలంగాణ గేయం వాణిని కూడా మార్చారని విమర్శించారు. తెలంగాణ రానివ్వనని ప్రమాణం చేసిన రోశయ్య విగ్రహాలను రాష్ట్రంలో ఏర్పాటు చేశారని అన్నారు. రైతాంగానికి గోదావరి నీటిని అందించడంలో నిర్లక్ష్యం జరుగుతోందని, కృష్ణా జలాలను సైతం ఆంధ్రాకు వదిలేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందనే తప్ప.. వనరుల దోపిడీ మాత్రం పెరిగిపోయిందని విమర్శించారు. మేడిగడ్డ గేట్లకు మరమ్మతులు చేయకుండా నీటిని వృథాగా వదులుతున్నారని ఆరోపించారు.

**తెలంగాణ అస్తిత్వంపై దాడి జరుగుతోంది**

తెలంగాణ అస్తిత్వంపై దాడి జరుగుతోందని టీఎన్జీవోస్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ సాధించుకోవడం ఒక్కటే తమ లక్ష్యం కాదని, అన్ని రంగాల్లో సమాన అభివృద్ధి జరగాలని ఉద్యమకారులు కోరుకున్నారని చెప్పారు. పాలకులు మారినా తెలంగాణ అస్తిత్వంపై దాడి కొనసాగుతోందని విమర్శించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను ఇప్పుడు మేమే ఇచ్చిన తెలంగాణ అని కొందరు చెప్పుకోవడం బాధాకరమన్నారు. వరంగల్‌లోని మాస్టర్‌జీ కళాశాలలు తెలంగాణ ఉద్యమానికి కేంద్రాలుగా నిలిచాయని గుర్తుచేశారు. తెలంగాణ పోరాట చరిత్రను మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. పాలకులు ప్రజా సమస్యల కంటే తమ ఆస్తులను కాపాడుకునే పనుల్లో నిమగ్నమయ్యారని విమర్శించారు. తెలంగాణ అస్తిత్వ వేదిక మరోసారి పోరాటానికి సిద్ధమవుతోందని, వరంగల్ నుంచే తెలంగాణ అస్తిత్వ పరిరక్షణ ఉద్యమానికి శ్రీకారం చుడతామని కారం రవీందర్‌రెడ్డి స్పష్టం చేశారు.

**తెలంగాణ అస్తిత్వ వేదిక ఆధ్వర్యంలో పోరాటం**

తెలంగాణ సంస్కృతి, చరిత్ర, భాష, నీళ్లు, వనరులు, ఉద్యోగాలు, హక్కుల పరిరక్షణ కోసం ప్రజలను సమీకరిస్తామని వక్తలు తెలిపారు. తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను అడ్డుకోవడంతో పాటు రాష్ట్ర వనరులపై ప్రజలకు పూర్తి హక్కు ఉండేలా ఉద్యమిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అస్తిత్వ వేదిక రాష్ట్ర కన్వీనర్ పిట్టల రవీందర్, ఓబీసీ ప్రధాన కార్యదర్శి, ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, సీనియర్ జర్నలిస్ట్ బుచ్చన్న, రాష్ట్ర గెజిటెడ్ వైస్ ప్రెసిడెంట్ జగన్‌మోహన్‌రావు, తెలంగాణ లెక్చరర్స్ ఫోరం రాష్ట్ర సలహాదారు గంగాపురం వేణుమాధవ్, డాక్టర్ జేఏసీ నాయకుడు నాగేంద్రబాబు, గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోనగాని యాదగిరిగౌడ్, గుల్లపల్లి చిరంజీవి, వద్దిరాజు గణేష్, తాడిశెట్టి క్రాంతి, కొక్కొండ విజయబాబు, రాచకొండ ప్రవీణ్, డాక్టర్ శ్రీరామ్ శ్యామ్, డాక్టర్ పాలమాకుల కొమరయ్య, డాక్టర్ వోడితల రాము, రావుల రాజకుమార్, గుండేటి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

## భార్య మృతితో కుంగిపోయి.. వృద్ధుడి బలవన్మరణం

**కడవేరుగులో విషాద ఘటన.. పెద్ద కుమారుడి వద్దే ఉంటున్న వృద్ధుడు**





**కాకతీయ, చేర్యాల:** భార్య మృతిని తట్టుకోలేక మనస్తాపానికి గురైన ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన చేర్యాల మండలం కడవేరుగు గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది.గ్రామానికి చెందిన పబ్బోజు కిష్టయ్య (68) కు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వారందరికీ వివాహాలు కావడంతో వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. రెండేళ్ల క్రితం అనారోగ్యంతో భార్య మృతి చెందడంతో అప్పటి నుంచి కిష్టయ్య ఆమెను తలుచుకుంటూ బాధపడేవాడని గ్రామస్తులు తెలిపారు. ప్రస్తుతం ఆయన తన పెద్ద కుమారుడి వద్ద ఉంటున్నట్లు పేర్కొన్నారు.ఈ క్రమంలో శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ ఘటనతో కడవేరుగు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## కష్టకాలంలో అండగా నిలిచిన ఉపసర్పంచ్ గట్టు శ్రావణ్



**కాకతీయ, శంకరపట్నం :** ముత్తారం గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కీర్తిశేషులు కనకం నాగయ్య ఆకస్మిక మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. ఆయన కుటుంబాన్ని ఉపసర్పంచ్ గట్టు శ్రావణ్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి తన వంతు సహాయంగా రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా నిలిచిన గట్టు శ్రావణ్‌ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ సీనియర్ నాయకులు గూళ్ళ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మానాల గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా జక్కుల శ్రీనివాస్



**కాకతీయ, రుద్రంగి:** రుద్రంగి మండలం మానాల గ్రామ అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా జక్కుల శ్రీనివాస్, వైస్ చైర్మన్‌గా చెదలు నవీన్, రెండో వైస్ చైర్మన్‌గా బాధవత్ రవి, కార్యదర్శిగా నాంచారి రాకేష్ ఎన్నికయ్యారు. గ్రామ అభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ కార్యక్రమాల అమలుకు సమష్టిగా కృషి చేస్తామని నూతన చైర్మన్ జక్కుల శ్రీనివాస్ తెలిపారు. నూతన కార్యవర్గాన్ని గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## గంజాయి గుట్టు రట్టు.. నలుగురు అరెస్ట్

- 1,100 గ్రాముల గంజాయి స్వాధీనం
- సరఫరా మూలాలపై పోలీసుల దర్యాప్తు
- ఏటూరునాగారం పోలీసులు నలుగురి అరెస్ట్

**కాకతీయ, ఏటూరునాగారం:** ఏటూరునాగారం పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. విశ్వసనీయ సమాచారం మేరకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించగా 1,100 గ్రాముల గంజాయి పట్టుబడింది. ఈ వ్యవహారంలో జగదీష్, రామ్‌చరణ్‌తేజ్, ఆకుల వంశీ, వరప్రసాద్‌లను పోలీసులు అరెస్ట్ చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆకుల వంశీ (28) పంప్ ఆపరేటర్‌గా పనిచేస్తుండగా, అతడి స్వస్థలం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం సీతానగరం. మరో నిందితుడు వరప్రసాద్ పెట్లర్‌గా ఉన్నట్లు తెలిపారు. ప్రాథమిక విచారణలో జగదీష్, ఆకుల వంశీలు మాదకద్రవ్యాలను కొనుగోలు చేసినట్లు, ఆకుల వంశీ వాటిని వరప్రసాద్ వద్ద నుంచి సేకరించినట్లు వెల్లడైందన్నారు. దీంతో గంజాయి సరఫరా మూలం, రవాణా మార్గం, ఇతరుల ప్రమేయంపై దర్యాప్తు ముమ్మరం చేశారు. గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగాన్ని ఉపేక్షించబోమని పోలీసులు స్పష్టం చేశారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

## లాలుతండా జీపీలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

**కాకతీయ, ఇనుగుర్తి :** ఇనుగుర్తి మండలం లాలు తండా గ్రామపంచాయతీ పరిధిలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం సర్పంచ్ భూక్య లక్ష్మీ వెంకన్న నాయక్ ప్రారంభించారు. నెల రోజులుగా విద్యుత్ సమస్యతో రైతులు, తండావాసులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళి నాయక్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేశారని సర్పంచ్ తెలిపారు. దీంతో విద్యుత్ కష్టాలు తొలగుతాయని, ఎమ్మెల్యేకు గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు భూదానం చేసిన గూగులోతు సంతోష్, వాంకుడోత్ రవికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రజిత రాజు, వార్డు సభ్యులు భూక్య జీవన్, రవి, సీతారాం, ఏఈ రాజు, లైన్మెన్ మలిశెట్టి యశ్వంత్, లైన్ ఇన్‌స్పెక్టర్ బో తదితరులు పాల్గొన్నారు.

## టీచర్ అంజుమ్ సుల్తానాకు ప్రతిభా పురస్కారం

- గాంధీ జయంతి వేడుకల్లో ఘనంగా సన్మానం



**కాకతీయ, నెల్లికుదురు:** విద్యా రంగంలో అందిస్తున్న సేవలకు గుర్తింపుగా మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలోని టీజీఎంఎస్ సోషల్ టీచర్ ఎం.ఏ. అంజుమ్ సుల్తానాకు ప్రతిభా పురస్కారం లభించింది. హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియంలో గాంధీ జ్ఞాన ప్రతిష్ఠాన్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో శుక్రవారం ఆమెను ఘనంగా సన్మానించి పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, సామాజిక అవగాహన, నాణ్యమైన బోధనకు తాను చేస్తున్న కృషికి ఈ పురస్కారం గుర్తింపుగా భావిస్తున్నట్లు అంజుమ్ సుల్తానా తెలిపారు. పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ఉపేందర్‌రావుతో పాటు ఉపాధ్యాయ బృందం అంజుమ్ సుల్తానాను అభినందించారు.

# బైపాస్ మార్గంపై ప్రభుత్వం ఆలోచించాలి

- ఇళ్లు కోల్పోతున్న వారికి న్యాయం చేయాలి
- సీపీఐ జాతీయ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి డిమాండ్



రోడ్డు వెడల్పులో ఇళ్లు కోల్పోతున్న బాధితులు రెండు రోజులుగా నిర్వహిస్తున్న రిలే నిరాహార

**కాకతీయ, చిగురుమామిడి :** కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ వరకు నాలుగు వరుసల రహదారి విస్తరణలో ఇళ్లు, భూములు కోల్పోతున్న వారికి ప్రభుత్వం పునరావాసం కల్పించి నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ జాతీయ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. చిగురుమామిడిలో దీక్ష శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. బాధితులు తమ సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు. నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని, అయితే ఇళ్లు కోల్పోతున్న వారికి న్యాయం చేయకుండా, నష్టపరిహారం ఇవ్వకుండా నివాసాలను కూల్చడం సరికాదని చాడ వెంకటరెడ్డి అన్నారు. 70 ఏళ్లుగా ఉన్న ఇళ్లతోపాటు ఇటీవల లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించుకున్న ఇళ్లను కోల్పోతే కుటుంబాలు తీవ్రంగా నష్టపోతాయన్నారు. బైపాస్ మార్గం ద్వారా రహదారి నిర్మించే అవకాశం ఉన్నా ప్రభుత్వం ఆ దిశగా ఎందుకు ఆలోచించడం లేదని ప్రశ్నించారు. ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోయిన వారికి పరిహారం ఇచ్చిన విధంగానే ఇళ్లు కోల్పోతున్న వారికి ఇంటి స్థలంతోపాటు నిర్మాణ వ్యయాన్ని లెక్కించి నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. బాధితుల సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం కోసం కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అందె స్వామి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు అందె చిన్నస్వామి, తేరాల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ గోలీ బాపురెడ్డి, సీపీఐ నాయకుడు కయ్యం వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఇవ్వాలి

- గాంధీ విగ్రహం ఎదుట టీయూడబ్ల్యూజే నిరసన



**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో జర్నలిస్టులకు వెంటనే హెల్త్ కార్డులు మంజూరు చేయాలని టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఆర్ లెనిన్ డిమాండ్ చేశారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ పిలుపు మేరకు శుక్రవారం వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు కోరుకొప్పుల నరేందర్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు ముఖ్యమంత్రికి లేఖలు రాసి నిరసన తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు గడిచినా జర్నలిస్టుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని బీఆర్ లెనిన్ అన్నారు. ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, అక్రిడిటేషన్ల జారీ వంటి అంశాల్లో నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. వరంగల్‌లో జర్నలిస్టుల కోసం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇప్పటికీ పంపిణీ చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. వెంటనే హెల్త్ కార్డులు మంజూరు చేయడంతోపాటు జర్నలిస్టులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే దశలవారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు చిలుముల సుధాకర్, తడక రాజనారాయణ, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, తుమ్మ శ్రీధర్‌రెడ్డి, కక్కెర్ల అనిల్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి వాంకె శ్రీనివాస్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు నవనీత్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి నీలం శివ తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు నెలల గర్భిణి ఆత్మహత్య

- సేవించిన స్వర్ణలత
- చికిత్స పొందుతూ ఆసుపత్రిలో కన్నుమూత
- అదనపు కట్నం, భూమి కోసం వేధింపుల ఆరోపణలు
- భర్త, అత్తమామలపై కేసు నమోదు



కాకతీయ, ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రోయ్యూరు గ్రామానికి చెందిన 4 నెలల గర్భిణి దుర్గం స్వర్ణలత (25) మృతి చెందారు. అదనపు కట్నం, భూమి కోసం భర్త హరీష్ (28), అత్త వజ్రమ్మ, మామ లింగయ్య తన కుమార్తెను శారీరకంగా, మానసికంగా వేధించారని తండ్రి దుర్గం లక్ష్మీనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏటూరునాగారం పోలీసులు క్రైం నంబర్ 169/2026, బీఎన్ఎస్ సెక్షన్ 80 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం.. స్వర్ణలతకు హరీష్‌తో 2025 మే 29న ప్రేమ వివాహం జరిగింది. వీరికి ఓ కుమారుడు ఉన్నాడు. శుక్రవారం ఉదయం స్వర్ణలత అస్వస్థతకు గురికావడంతో ఏటూరునాగారం ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా ఉదయం సుమారు 10 గంటలకు వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. స్వర్ణలత మృతిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తూ, గతంలో కట్నం, డబ్బులు, భూమి కోసం ఒత్తిడి, వేధింపులు జరిగినట్లు తెలిపారు. ఘటనకు ముందు జరిగిన పరిణామాలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. సాక్ష్యాధారాల ఆధారంగా చట్టప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

## నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి

- ఉపాధి హామీతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి
- ప్రతి ఇంటా ఇంకుడు గుంతలు.. పొలాల్లో ఫార్మ్ పాండ్లు
- వరంగల్ జిల్లా పరిషత్ సీఈఓ ఎన్. వసంత



**కాకతీయ, గీసుకొండ:** ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని, భవిష్యత్‌లో నీటి కొరత రాకుండా నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని వరంగల్ జిల్లా పరిషత్ సీఈఓ ఎన్. వసంత సూచించారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని మండలంలోని 21 గ్రామపంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. కోనాయమాకుల గ్రామసభలో సీఈఓ పాల్గొని మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రతి ఇంటా ఇంకుడు గుంతలు, వ్యవసాయ పొలాల్లో ఫార్మ్ పాండ్లు, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు రీచార్జ్ నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన వారికి జాబ్ కార్డులు ఇప్పించి, కూలీలకు అందుబాటులో ఉండేలా వివిధ ప్రాంతాల్లో ఉపాధి పనులు ఏర్పాటు చేయాలన్నారు. మహిళా సంఘాల సభ్యులకు ఉపాధి హామీపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఉపాధి హామీ కింద 90 పని దినాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. గ్రామంలో వీఓ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని, అవసరమైన చోట శానిటరీ కాంప్లెక్స్‌లు, అంగన్వాడీ భవనాలు నిర్మించాలని సూచించారు. అనంతరం గ్రామ రిసోర్స్ మ్యాప్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో కమలాకర్, సర్పంచ్ వజ్ర రాజు, పంచాయతీ కార్యదర్శి రామారావు, ఉపసర్పంచ్ పిసాల రాజేశ్వర్‌రావు, అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## గ్రామసభ దరఖాస్తులపై నిర్లక్ష్యం

- గ్రామసభ దరఖాస్తులపై నిర్లక్ష్యం
- బహిరంగ ప్రదేశంలో వదిలివేత
- పంచాయతీ తీరుపై గ్రామస్తుల ఆగ్రహం




**కాకతీయ, వరంగల్ ప్రతినిధి:** నెక్కొండ మండలం సాయిరెడ్డిపల్లి గ్రామపంచాయతీలో నిర్వహించిన గ్రామసభలో దరఖాస్తుల నిర్వహణపై నిర్లక్ష్యం వెలుగులోకి వచ్చింది. ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను భద్రపరచకుండా గ్రామసభ ప్రాంగణంలోని టేబుల్‌పై వదిలేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన సిరిమిల్ల హరీష్ వీబీజీఆర్ఏఎంజీ పథకం కింద పశువుల కొట్టం, కొత్త జాబ్‌కార్డు కోసం రెండు దరఖాస్తులను గ్రామ కార్యదర్శి కవిత, సర్పంచ్ బండారుపల్లి వినయకుమారికి అందజేశారు. గ్రామసభ ముగిసిన అనంతరం తన దరఖాస్తులను అధికారులు భద్రపరచకుండా టేబుల్‌పై వదిలేశారని హరీష్ ఆరోపించారు. తిరిగి కార్యాలయానికి వెళ్లినప్పుడు దరఖాస్తులు బయటే పడి ఉండటాన్ని చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాల కోసం ప్రజలు సమర్పించే దరఖాస్తులను బాధ్యతగా నిర్వహించాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇలాంటి నిర్లక్ష్యంతో అర్హులైన లబ్ధిదారులు నష్టపోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఘటనపై ఉన్నతాధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, తాను సమర్పించిన దరఖాస్తులను అధికారికంగా స్వీకరించి త్వరగా పరిష్కరించాలని హరీష్ కోరారు.

## వరంగల్ జిల్లాలో 38 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) కింద వరంగల్ జిల్లా పరిధిలో ఒప్పంద మరియు ఔట్ సోర్సింగ్ విధానంలో 38 వివిధ పోస్టుల భర్తీకి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి నోటిఫికేషన్ విడుదల చేశారు.
అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. పోస్టుల ఖాళీలు, అర్హతలు, వయోపరిమితి, వేతనం తదితర పూర్తి వివరాలు జిల్లా కలెక్టర్ అధికారిక వెబ్ సైట్ https://warangal.telangana.gov.in/ లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అభ్యర్థులు నిర్దేశిత దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేసి, అవసరమైన జిరాక్స్ పత్రాలు మరియు రూ. 500/ డీడీని జత చేసి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం, వరంగల్ నందు తేది: 03102026 నుండి 09102026 లోపు సమర్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

## వన్యప్రాణులు, అటవీ ప్రాంతాల పరిరక్షణే లక్ష్యం



**కాకతీయ, ఏటూరునాగారం రూరల్:** వన్యప్రాణులు, అటవీ ప్రాంతాలను ప్లాస్టిక్ కాలుష్యం నుంచి రక్షించడంతోపాటు ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు 72వ జాతీయ వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఏటూరునాగారం అటవీ డివిజన్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. రెండు బృందాలుగా ఏర్పడి పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. ఒక బృందం ఏటూరునాగారం డివిజన్ కార్యాలయం నుంచి చిన్నబోయినపల్లి పల్లె ప్రకృతి వనం వరకు, మరో బృందం ఐటీఐ కళాశాల నుంచి జీడివాగు వరకు ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించింది. కార్యక్రమంలో డీఆర్వో నారాయణ, సెక్షన్ అధికారులు బాలాజీ, శోభారాణి, బీట్ అధికారులు దయానంద్, పవన్, ప్రశాంత్, వినోద్, రాజేష్ కే, ప్రతిభ, వేణు, రాంప్రసాద్, రాజేష్ ఎం, రవి, దిలీప్ పాల్గొన్నారు. బేస్ క్యాంపు సిబ్బంది విశ్వనాథ్, బిక్షపతి, ప్లాంటేషన్, చెక్‌పోస్ట్ వాచర్లు, ప్లాస్టిక్ సేకరణ సిబ్బంది సహకరించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, వ్యర్థాలను నిర్దేశిత ప్రదేశాల్లోనే వేయాలని అధికారులు సూచించారు.

## రైస్ మిల్లు నిర్మాణం వద్దంటూ గ్రామస్తుల ధర్నా



**కాకతీయ, ఇనుగుర్తి:** మండలంలోని చిన్న నాగారం గ్రామం సమీపంలో రైస్ మిల్లు నిర్మాణం చేయవద్దంటూ గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. గ్రామసభలో వినతి పత్రం అందజేసిన అనంతరం రైస్ మిల్లు ముందు, చిన్ననాగారం-ఎర్రబెల్లిగూడెం రహదారిపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామానికి ఆనుకొని రైస్ మిల్లు నిర్మిస్తే కాలుష్యం, శబ్ద సమస్యలు ఏర్పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో ఇళ్లకు సమీపంలో, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కనీస దూరం పాటించకుండా నిర్మాణం చేపడుతున్నారని ఆరోపించారు. మిల్లు నిర్మాణంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే కార్మికుల వల్ల గ్రామంలో సమస్యలు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని రైస్ మిల్లుకు అనుమతులు ఇవ్వవద్దని ఉన్నతాధికారులను కోరారు. కార్యక్రమంలో గుడాల లక్ష్మారెడ్డి, బైరు రమేష్, ఉడుత సోమయ్య, బొబ్బల దేవరాజు, గుగులోతు లక్ష్మి, మాదగాని ఉమేష్, వడపల్లి వెంకన్న, ఆలకుంట్ల సోమయ్య, బత్తిని ఐలయ్య, మునిగంటి రమేష్, గుండాల దర్గా స్వామి, నిడిగంటి బిక్షం, గుగులోతు జానీ, మద్దబోయిన సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

## గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలి



**కాకతీయ, ఏటూరునాగారం :** మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, పరిశుభ్రత, సేవాభావం వంటి విలువలను ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాలని ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో సూచించారు. గురువారం ఐటీడీఏ కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. పీఓ లెనిన్ వత్సల్ టోప్పో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అధికారులు, సిబ్బంది పుష్పాంజలి ఘటించారు. ప్రజలకు మెరుగైన, పారదర్శక సేవలు అందిస్తూ గాంధీజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ అనిల్, డీడీ జనార్ధన్, డీడీ వింగ్ ఏఓ ఆత్రం లింగు, అకౌంట్స్ మేనేజర్ నర్సింగరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ కుటుంబానికి కొండా అండ



**కాకతీయ, గీసుగొండ:** అనారోగ్యంతో మృతి చెందిన పోతురాజుపల్లి మాజీ సర్పంచ్ మంద బాబురావు కుటుంబానికి మాజీ మంత్రి కొండా సురేఖ అండగా నిలిచారు. బాబురావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించిన సురేఖ.. కుటుంబ సభ్యులను పరామర్శించి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం తనవంతు సహాయంగా రూ.1 లక్ష ఆర్థిక సాయం అందజేశారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. సర్పంచిగా బాబురావు గ్రామానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నవీన్ రాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్, కొమ్ముల కిషోర్, డోలె చిన్ని తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ అస్తిత్వం దెబ్బతింది

- జిల్లాను ముక్కలు చేసి ఆగం చేశారు
- ప్రశ్నించే తత్వాన్ని లేకుండా చేసే కుట్ర జరిగింది
- ఎంపీ టికెట్ చేజారడం వెనుక నలుగురు నేతలు
- నా రాజకీయ గురువు ఇప్పటికీ.. ఎప్పటికీ కేసీఆరే
- ఉద్యమకారుల బతుకులు మారలేదు
- రూ.10 వేల కోట్లతో ఉద్యమకారుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి
- తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్, ప్రముఖ న్యాయవాది గుడిమళ్ళ రవికుమార్
- తెలంగాణ డిజిటల్ మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్



తెలంగాణ ఉద్యమాల్లో గర్జించిన చారిత్రక ఓరుగల్లు గడ్డ స్వరాష్ట్రంలో అన్ని రంగాల్లోనూ దారుణంగా వెనుకబడిపోయిందని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్, ప్రముఖ న్యాయవాది గుడిమళ్ల రవికుమార్ అన్నారు. ఒకప్పుడు వరంగల్ అంటేనే తెలంగాణలో ప్రత్యేకమైన బ్రాండ్ ఉండేదని, రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆ ప్రాధాన్యం క్రమంగా తగ్గుతూ ప్రస్తుతం మసకబారుతోందని పేర్కొన్నారు. హైదరాబాద్ తర్వాత రెండో రాజధానిగా అభివృద్ధి చేస్తామన్న ఆశలు నెరవేరలేదని, కొందరి స్వార్థపూరిత రియల్ ఎస్టేట్, ఆర్థిక ప్రయోజనాల కోసం జిల్లాను విచక్షణారహితంగా ముక్కలు చేశారని విమర్శించారు. జిల్లాను విభజించడం వల్ల వరంగల్ సమగ్ర రాజకీయ, సామాజిక అస్తిత్వం బలహీనపడిందని, ప్రజల తరఫున ప్రశ్నించాల్సిన ప్రజాప్రతినిధులు అధిష్ఠానం వద్ద మోకరిల్లడంలో, కాళ్లు మొక్కడంలో పోటీ పడుతున్నారని వ్యాఖ్యానించారు. తన రాజకీయ ప్రయాణంలో ఎదురైన పరిణామాలు, ఎంపీ టికెట్ చేజారిన తీరు, కేసీఆర్‌తో తన అనుబంధం, తెలంగాణ ఉద్యమకారుల పరిస్థితి, ఓదార్పు యాత్ర, ఆటోడ్రైవర్ల సమస్యలు, భవిష్యత్ రాజకీయ ప్రస్థానంపై తెలంగాణ డిజిటల్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

## ఎంపీ టికెట్ చేజారడం వెనుక నలుగురు నేతలు

నా రాజకీయ ప్రయాణంలో కుట్రలు కోకొల్లలుగా ఎదురయ్యాయి. రాజకీయాల్లోకి వచ్చి ప్రజల కోసం పనిచేస్తున్న సమయంలో ఎన్నో పరిణామాలను చూశాను. ముఖ్యంగా వరంగల్ ఎంపీ టికెట్ విషయంలో జరిగిన పరిణామాలు నాకు ఇప్పటికీ గుర్తున్నాయి. నాకు ఎంపీ టికెట్ దాదాపుగా ఖరారైన పరిస్థితి ఉంది. నా చట్ట పరిజ్ఞానం, వాగ్ధాటి, భాషా నైపుణ్యాలు ఢిల్లీ రాజకీయాల్లో ఉపయోగపడతాయని నాయకత్వం భావించింది. కానీ నా రాజకీయ ఎదుగుదలను అడ్డుకోవడానికి కొందరు నాయకులు వ్యతిరేకంగా వ్యవహరించారు. నాకు వ్యతిరేకంగా తప్పుడు నివేదికలు ఇచ్చారు. ఆ పరిణామాల కారణంగానే టికెట్ దక్కలేదని నేను భావిస్తున్నాను. నా ఎంపీ టికెట్ చేజారడం వెనుక నలుగురు నేతలు ముఖ్యపాత్ర పోషించారు. కేసీఆర్‌ను కూడా కొందరు తప్పుదోవ పట్టించారు. అయితే చివరికి ఆయన కూడా విషయాలను చూసుకోవాల్సిన బాధ్యత కలిగిన నాయకుడే కదా. అప్పట్లో జరిగిన అన్ని విషయాలను ఇప్పుడు బయటపెట్టడం లేదు. సమయం వచ్చినప్పుడు ఒక్కొక్క విషయం బయటకు వస్తుంది. నా రాజకీయ జీవితంలో జరిగిన పరిణామాలపై ఒక పుస్తకం రాయాలనే ఆలోచన కూడా ఉంది. అందులో జరిగిన విషయాలను పూర్తి వివరాలతో ప్రజల ముందుకు తీసుకురావాలనుకుంటున్నాను. ఇప్పుడే అన్నీ చెప్పాల్సిన అవసరం లేదు. సరైన సమయంలో నిజాలు బయటకు వస్తాయి.

## జిల్లాను ముక్కలు చేశారు

వరంగల్ జిల్లాను విభజించిన విధానం ఈ ప్రాంత అస్తిత్వంపై ప్రభావం చూపింది. పరిపాలనా సౌలభ్యం పేరుతో జిల్లాలను ఏర్పాటు చేసినప్పటికీ, వరంగల్ అనే సమగ్ర రాజకీయ, సామాజిక, ఆర్థిక అస్తిత్వం బలహీనపడింది. కొందరు స్వార్థపరుల రియల్ ఎస్టేట్, ఆర్థిక ప్రయోజనాల కోసం జిల్లాను విచక్షణారహితంగా ముక్కలు చేశారనే అభిప్రాయం ఉంది. దాని వల్ల సహజమైన రాజకీయ బలం తగ్గింది. ప్రజా సమస్యలపై సమష్టిగా ప్రశ్నించే శక్తి బలహీనపడింది. ఒకప్పుడు ఏ సమస్య వచ్చినా వరంగల్ నుంచి బలమైన గొంతు వినిపించేది. ఇప్పుడు ఆ స్థాయిలో సమష్టి స్వరం వినిపించడం లేదు. ప్రజల సమస్యలపై ప్రశ్నించే తత్వాన్ని లేకుండా చేసే కుట్ర జరిగినట్టుగా పరిస్థితి తయారైంది. జిల్లాను ముక్కలు చేయడం వల్ల కేవలం భౌగోళిక మార్పు మాత్రమే జరగలేదు. రాజకీయంగా కూడా వరంగల్‌కు ఉన్న బలం దెబ్బతింది. తెలంగాణ ఉద్యమాల్లో గర్జించిన ఓరుగల్లు తన హక్కుల కోసం అదే స్థాయిలో ప్రశ్నించలేని పరిస్థితి రావడం ఆందోళనకరం.

## ప్రజల గొంతుకగా నిలిచే నేతలెక్కడా?

వరంగల్ అభివృద్ధికి కావాల్సిన నిధులను రాబట్టడంలో ఇక్కడి ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం, అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి నిధులు సాధించాల్సిన నాయకులు ఆ పని చేయడం కంటే అధిష్ఠానం వద్ద మోకరిల్లడంలో, కాళ్లు మొక్కడంలో పోటీ పడుతున్నారు. ప్రజల తరఫున నిలబడి ప్రశ్నించాల్సిన సమయంలో పదవులు, వ్యక్తిగత ప్రయోజనాలు, రాజకీయ భవిష్యత్తు కోసం రాజీపడే పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా వరంగల్ అభివృద్ధి వెనుకబడింది. ప్రజాప్రతినిధులు ప్రజల గొంతుకగా నిలవాలి. వరంగల్‌కు రావాల్సిన ప్రాజెక్టులు, నిధులు, సంస్థలు, అవకాశాల కోసం ప్రభుత్వాన్ని నిలదీయాలి. కానీ అలాంటి రాజకీయ పోరాటం కనిపించడం లేదు. తెలంగాణ ఉద్యమంలో వరంగల్ పోషించిన పాత్రకు తగ్గట్టుగా ప్రజాప్రతినిధులు వ్యవహరించాలి. ప్రజల సమస్యలపై ప్రశ్నించాలి. ప్రాంత ప్రయోజనాల కోసం పోరాడాలి. కానీ అధిష్ఠానం వద్ద విధేయత ప్రదర్శించడానికే ప్రాధాన్యం ఇస్తే వరంగల్ ప్రయోజనాలు దెబ్బతింటాయి. ఇదే పరిస్థితి కొనసాగితే వరంగల్ తన ప్రత్యేకతను మరింత కోల్పోయే ప్రమాదం ఉంది.

## కేసీఆరే నా రాజకీయ గురువు

రాజకీయంగా నాకు ఇప్పటికీ.. ఎప్పటికీ కేసీఆరే గురువు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి ఆయనతో నాకు అనుబంధం ఉంది. ఉద్యమం అంటే ఏమిటి.. ప్రజలను ఎలా సమీకరించాలి.. ఒక లక్ష్యం కోసం ఎలా పోరాడాలి.. అనే విషయాల్లో తెలంగాణ ఉద్యమం నాకు ఎంతో నేర్పింది. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం ప్రత్యేకమైన రాజకీయ ప్రక్రియగా సాగింది. ఆ ఉద్యమంలో పాల్గొన్న అనేక మంది తమ జీవితాలను, సమయాన్ని, ఆర్థిక వనరులను పణంగా పెట్టారు. నేను కూడా ఆ ఉద్యమంలో భాగస్వామినే. రాజకీయ ప్రయాణంలో ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా కేసీఆర్‌ను నా రాజకీయ గురువుగా భావిస్తాను. రాజకీయంగా నా భవిష్యత్ ప్రయాణం ఎలా ఉంటుంది అన్నది కాలమే నిర్ణయించాలి. ప్రస్తుతం నా దృష్టి మాత్రం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడం, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం, వారికి న్యాయం జరిగేలా పోరాడటంపైనే ఉంది. రాజకీయాల్లో పదవులు శాశ్వతం కాదు. కానీ ఒక ఉద్యమంలో కలిసి పనిచేసిన అనుబంధం మాత్రం మిగిలిపోతుంది. అందుకే ఇప్పటికీ కేసీఆర్‌ను నా రాజకీయ గురువుగా గౌరవిస్తాను.

## ఉద్యమకారుల బతుకులు మారలేదు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు దాటినా నిజాయితీగా ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుల జీవితాల్లో ఆశించిన మార్పు రాలేదు. రాష్ట్ర సాధన కోసం తమ సమయాన్ని, డబ్బును, మేధస్సును, వయస్సును పెట్టుబడిగా పెట్టిన వారికి తగిన గుర్తింపు దక్కడం లేదు. ఈ రాష్ట్ర సాధనలో పెట్టుబడి పెట్టిన వారికి సరైన వాటా దక్కడం లేదు. ఉద్యమకారులను గుర్తించడం అంటే కేవలం సన్మానాలు చేయడం కాదు. వారి కుటుంబాల ఆర్థిక, సామాజిక పరిస్థితులను మెరుగుపరిచే విధంగా శాశ్వత చర్యలు తీసుకోవాలి. ఉద్యమ సమయంలో తమ జీవితాలను పక్కన పెట్టి తెలంగాణ కోసం నిలిచిన వారికి స్వరాష్ట్రంలో తగిన గౌరవం, రాజకీయ ప్రాధాన్యం రావాలి. ఉద్యమానికి కరదీపికగా పనిచేసినవారు అధికారంలో భాగస్వామ్యం కావడానికి ఎందుకు పనికిరారని ప్రశ్నించాల్సిన పరిస్థితి ఉంది. ఉద్యమకారుల త్యాగాలకు గుర్తింపు రావాలి. వారి కుటుంబాలు గౌరవప్రదంగా జీవించే పరిస్థితి కల్పించాలి. రాష్ట్రం కోసం పోరాడిన వారికి రాష్ట్రంలో సరైన వాటా దక్కాలన్నదే మా డిమాండ్.

## ఓరుగల్లు గడ్డ అస్తిత్వమే దెబ్బతింది

తెలంగాణ ఉద్యమంలో వరంగల్ పాత్రను ఎవరూ విస్మరించలేరు. ఓరుగల్లు గడ్డ ఉద్యమాలకు కేంద్రంగా నిలిచింది. తెలంగాణ కోసం జరిగిన ప్రతి కీలక పోరాటంలో ఈ ప్రాంతం తనదైన ముద్ర వేసింది. ప్రజలను కదిలించిన అనేక ఉద్యమాలకు వరంగల్ వేదికగా నిలిచింది. అలాంటి చారిత్రక ప్రాంతం స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాల్సింది పోయి వెనుకబడిపోయింది. ఒకప్పుడు వరంగల్ అంటే ఒక పెద్ద బ్రాండ్. తెలంగాణలోనే ప్రత్యేక గుర్తింపు ఉండేది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ జిల్లాకు ఉన్న ప్రాధాన్యం క్రమంగా తగ్గిపోయింది. ఇది అందరూ అంగీకరించాల్సిన వాస్తవం. హైదరాబాద్ తర్వాత రెండో రాజధానిగా వరంగల్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పిన మాటలు ఆచరణలో పెద్దగా కనిపించడం లేదు. వరంగల్‌కు రావాల్సిన ప్రాధాన్యం, పెట్టుబడులు, అభివృద్ధి అవకాశాలు ఆశించిన స్థాయిలో రావడం లేదు. తెలంగాణ ఉద్యమానికి వెన్నెముకగా నిలిచిన ఈ ప్రాంతానికి స్వరాష్ట్రంలో ఇలాంటి పరిస్థితి రావడం బాధాకరం. వరంగల్ తన సహజమైన పోరాట పటిమను, ప్రశ్నించే తత్వాన్ని కోల్పోయేలా పాలకులు వ్యవహరించారు. అందుకే వరంగల్ ఆత్మను చంపేశారనే భావన కలుగుతోంది.

## న్యాయవాదిగా.. సామాజిక ఉద్యమకారుడిగా

1995లో న్యాయవాద వృత్తిని ప్రారంభించాను. కోర్టులో కుల, వర్గ వివక్షను ఎదుర్కొన్నాను. చట్టాలపై పట్టు, ఆంగ్లం, హిందీ భాషల పరిజ్ఞానంతో న్యాయవాదిగా గుర్తింపు తెచ్చుకున్నాను. క్రాస్ ఎగ్జామినేషన్‌లో బలమైన వాదనలతో కేసులు వాదించాను. పేదలు, ఉద్యమకారుల కేసులను అనేక సందర్భాల్లో ఉచితంగా వాదించాను. 1998లో యువ న్యాయవాదుల సంఘాన్ని ఏర్పాటు చేసి న్యాయవాదుల వృత్తి నైపుణ్యాల పెంపునకు కార్యక్రమాలు నిర్వహించాను. చిన్నతనంలోనే వివిధ సామాజిక వర్గాల మధ్య పెరిగిన అనుభవం నా ఆలోచనా విధానంపై ప్రభావం చూపింది. వరంగల్‌లో పుట్టి రంగంపేటలో పెరిగాను. నా తల్లి గుడిమళ్ళ పుష్పలీల ఎంజీఎంలో నర్సుగా పనిచేశారు. తండ్రి రాఘవేందర్‌రావు ఫార్మసిస్ట్‌గా పనిచేశారు. వారిద్దరిదీ కులాంతర ప్రేమవివాహం. దళిత, బడుగు, బలహీన వర్గాల సమస్యలను దగ్గరగా చూసే అవకాశం చిన్నతనం నుంచే వచ్చింది. అందుకే సామాజిక సమస్యలపై స్పందించే స్వభావం ఏర్పడింది.

## ఆటోడ్రైవర్ల కోసం ప్రత్యేక యూనియన్ ఏర్పాటు

ఆటోడ్రైవర్లపై జరుగుతున్న వివక్ష, వారు ఎదుర్కొంటున్న బాధలను చూడలేక తెలంగాణ ఆటోడ్రైవర్ల యూనియన్‌ను స్థాపించాను. రాష్ట్రంలో ఈ రంగంపై లక్షలాది మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. కానీ ఈ రంగంలో పనిచేస్తున్న వారు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. తెలిసి.. తెలియక చేసిన తప్పులకు కూడా వేధింపులకు గురవుతున్నారు. రోడ్లపై పనిచేసే ఆటోడ్రైవర్ల పరిస్థితి, వారి కుటుంబాల జీవన స్థితి, రోజువారీ ఎదుర్కొనే ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకోవాలి. ఆటో రంగాన్ని కేవలం రవాణా వ్యవస్థలో ఒక భాగంగా చూడకుండా లక్షలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్న రంగంగా గుర్తించాలి. ఆటోడ్రైవర్ల సమస్యలపై ప్రత్యేక విధానాలు రూపొందించాలి. వారికి రక్షణ, సంక్షేమం, న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలి. ఈ సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతోనే తెలంగాణ ఆటోడ్రైవర్ల యూనియన్‌ను ఏర్పాటు చేశాను.



## రూ.10 వేల కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

ఉద్యమకారుల కోసం రూ.10 వేల కోట్లతో ప్రత్యేక సంక్షేమ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నదే మా ప్రధాన డిమాండ్. కేవలం గుర్తింపు పత్రాలు ఇవ్వడం, అప్పుడప్పుడు సన్మానాలు చేయడం వల్ల ఉద్యమకారుల సమస్యలు పరిష్కారం కావు. వారికి శాశ్వత ఆర్థిక భరోసా కల్పించాలి. పెన్షన్లతో పాటు వారి కుటుంబాల సంక్షేమానికి ప్రత్యేక పథకాలు అమలు చేయాలి. ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల నివాస స్థలం ఇవ్వాలి. ఉద్యమకారుల బాధిత కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. వారి పిల్లలకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో ప్రత్యేక ప్రాధాన్యం కల్పించాలి. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య సదుపాయాలు అందించాలి. వృద్ధాప్యంలో ఉన్న ఉద్యమకారులకు గౌరవప్రదమైన జీవితం కల్పించాలి. రూ.10 వేల కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే దాని ద్వారా ఉద్యమకారుల సంక్షేమానికి శాశ్వత కార్యక్రమాలు చేపట్టే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం దీనిపై సానుకూలంగా స్పందించాలి. ఉద్యమకారుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ప్రశ్నిస్తూనే ఉంటాం.

## మ్యాజిక్ నుంచి ఉద్యమాల వరకు

1982లో మిత్రులతో కలిసి మూన్‌లైట్ యూత్‌ను ఏర్పాటు చేశాం. వ్యాయామశాల నిర్వహించాం. నవచైతన్య అసోసియేషన్ ద్వారా కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాం. మహిళా విద్యార్థినులకు రక్షణగా నిలిచాం. వరదల సమయంలో సహాయక చర్యల్లో పాల్గొన్నాం. మెజీషియన్ ఉమాపతి వద్ద మ్యాజిక్ నేర్చుకుని వందలాది ప్రదర్శనలు ఇచ్చాను. మ్యాజిక్ షోల వల్ల నాలోని బిడియం, భయం తొలగిపోయాయి. ప్రజల ముందు మాట్లాడే ధైర్యం పెరిగింది. మైకు పట్టుకుని మాట్లాడే వాగ్ధాటి, నాయకత్వ లక్షణాలు కూడా అక్కడి నుంచే వచ్చాయి. మండల్ కమిషన్ పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్నాను. ఆ ఉద్యమ అనుభవాలు నా ప్రజా ఉద్యమ ప్రస్థానానికి ఉపయోగపడ్డాయి. 1980 నుంచి 2000 మధ్య ఉమ్మడి వరంగల్‌లో నెలకొన్న హింసాత్మక పరిస్థితులు నన్ను తీవ్రంగా ప్రభావితం చేశాయి. ఎన్‌కౌంటర్లు, మందుపాతరలు, అమాయకుల మరణాలు నన్ను కలచివేశాయి. తెలంగాణ వెనుకబాటుతనం, అసమానతలపై ఆలోచన మొదలైంది. ప్రత్యేక తెలంగాణ సాధనే శాంతియుత ప్రజా తెలంగాణకు మార్గమని నమ్మి, తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతపై లోతుగా అధ్యయనం చేశాను.

## 126 కుటుంబాలను కలిసిన ఓదార్పు యాత్ర

ప్రస్తుతం నేను తెలంగాణ ఉద్యమకారులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యాను. తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపట్టిన ఓదార్పు యాత్రకు మంచి స్పందన వస్తోంది. సెప్టెంబర్ 17న వరంగల్‌లోని తొలిదశ ఉద్యమ అమరవీరుల స్తూపం వద్ద యాత్ర ప్రారంభించాం. నాలుగు రోజులపాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించాం. 126 మంది ఉద్యమకారుల కుటుంబాలను కలిశాం. వారి కుటుంబాల్లో ఆశించిన సంతోషం కనిపించలేదు. ఉద్యమంలో నిజంగా పాల్గొన్న వారిని గుర్తించడం, వారి కుటుంబాలను కలవడం, వారి సమస్యలను తెలుసుకోవడం, వారి బాధలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం మా లక్ష్యం. ఉద్యమ సమయంలో ఎవరు ఏ స్థాయిలో పనిచేశారు.. ఎలాంటి పరిస్థితుల్లో పోరాడారు.. వారి కుటుంబాలు ఎలాంటి త్యాగాలు చేశాయి.. అనే విషయాలను తెలుసుకుంటున్నాం. పదేళ్లు దాటినా ఉద్యమకారుల బతుకులు ఎందుకు మారలేదు అనే ప్రశ్నకు సమాధానం వెతకాల్సిన అవసరం ఉంది. ఓదార్పు యాత్ర ద్వారా వారి సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు ప్రభుత్వం ముందు స్పష్టమైన డిమాండ్లను ఉంచుతున్నాం.

## ఉద్యమ ప్రముఖులతో కలిసి.. భవిష్యత్ పోరాటం

తెలంగాణ ప్రజా సమితి సదస్సులకు హాజరయ్యాను. ప్రొఫెసర్ జయశంకర్‌తో వేదిక పంచుకున్నాను. ప్రజాకవి కాళోజీ నారాయణరావు, భూపతి కృష్ణమూర్తి, ఆచార్య బి. జనార్ధన్‌రావు, ఆచార్య కూరపాటి వెంకటనారాయణ తదితరులతో కలిసి ఉద్యమ వేదికల్లో పాల్గొన్నాను. తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన అనుభవం నా రాజకీయ, సామాజిక ఆలోచనలకు పునాది వేసింది. నా రాజకీయ భవిష్యత్ ఏంటన్నది కాలమే నిర్ణయించాలి. ప్రస్తుతం రాజకీయ పదవులు, భవిష్యత్ లెక్కల కంటే ఉద్యమకారులను గుర్తించే పనిపైనే నా దృష్టి ఉంది. ఉద్యమకారుల కుటుంబాలను కలుస్తున్నాను. వారి సమస్యలను తెలుసుకుంటున్నాను. ఓదార్పు యాత్ర ద్వారా వారి పరిస్థితులను ప్రజల ముందుకు తీసుకెళ్తున్నాను. వరంగల్ తన సహజమైన పోరాట పటిమను తిరిగి పొందాలి. ప్రజల కోసం ప్రశ్నించే తత్వాన్ని కొనసాగిస్తాను. ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టబోను. తెలంగాణ కోసం జీవితాలను పెట్టుబడిగా పెట్టిన ఉద్యమకారులకు స్వరాష్ట్రంలో న్యాయం జరగాలన్నదే మా ప్రధాన లక్ష్యం. వారి హక్కుల సాధన కోసం పోరాటం కొనసాగిస్తాను.



ఉత్తరం కాకతీయ ఎడిటర్/
- కిరణ్ గౌడ్ అరెల్లి
7396604266

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at
H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266